క్లుప్తంగా

నేడు 'జగనన్నకు చెబుదాం' నిర్వహణ

భట్టిప్రోలు: భట్టిప్రోలు మార్కెట్ యార్డ్‌లో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జగనన్నకి చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జేవీబీ మల్లికార్జునరావు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రంజిత్ భాషా, జిల్లా స్థాయి అధికారులతో పాటు మండల ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

చేనేత కార్మికులకు మజూరీ పెంచాలి

భట్టిప్రోలు: చేనేత సహకార సంఘాల్లో పని చేస్తున్న కార్మికులకు వెంటనే మజూరీలు పెంచాలని ఏపీ చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కమిటీ నాయకులు మురుగుడు సత్యన్నారాయణ, దీపాల సత్యన్నారాయణలు కోరారు. సోమవారం చేనేత సహకార సంఘం వర్క్‌షెడ్ వద్ద కార్మికులతో మాట్లాడుతూ నేతన్నలు, మాస్టర్ వీవర్లకు జరిగిన ఒప్పందం ప్రకారం గత ఏడాది నవంబర్ 15వ తేదీ నుంచి మజూరీలు పెంచడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలోని మాస్టర్ వీవర్లు డిసెంబర్ ఒకటవ తేదీ నుంచి మజూరీలు పెంచి ఇస్తామని ప్రకటించారన్నారు. కానీ సహకార సంఘాలన్నీ చేనేత జౌళిశాఖ అధికారుల ఏలుబడిలో ఉన్నందున వారు ఇంత వరకు మజూరీలు పెంచలేదని పేర్కొన్నారు. వెంటనే సహకార సంఘాల్లో పని చేస్తున్న కార్మికులకు మజూరీలు పెంచాలని డిమాండ్ చేశారు.

రబీకి నీరు అందివ్వాలని అధికారులకు ఆదేశాలు



రేపల్లె రూరల్: రబీలో సాగుచేస్తున్న మినుము పంటకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని మండలంలోని మోర్లవారిపాలెం గ్రామ రైతులు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్‌కు విన్నవించారు. మండలంలోని మోర్లవారిపాలెం పంచాయతీలో సోమవారం పర్యటించిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గణేష్‌ను గ్రామ మినుము రైతులు కలిసి తమ సమస్యలను విన్నవించారు. స్పందించిన గణేష్ ఇరిగేషన్ శాఖ అధికారులకు సమస్యను తెలియజేసి గ్రామంలో సాగునీరు అందేలా చర్యలు చేపట్టారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరికలు



చెరుకుపల్లి: జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ లబ్ధి చేకూరిందని రేపల్లె నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. సోమవారం గుళ్లపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో నిజాంపట్నం మండలం ప్రజ్ఞం గ్రామం గౌడ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ పార్టీ కార్యకర్తలు 20 కుటుంబాల వారిని కండువాలు కప్పి పార్టీలోని ఆహ్వానించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

కొల్లూరు : ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఓవ్యక్తి గాయాల బారిన పడిన ఘటన మండలంలోని కిష్కిందపాలెం-తడికలపూడి గ్రామాల మధ్య చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తడికలపూడికి చెందిన కౌంతి భానుప్రసాద్ గ్రామం సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో పొలం పనులు ముగించుకుని ఆదివారం సాయంత్రం ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళుతున్న సమయంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహన దారుడు ఢీకొట్టడంతో వాహనం అదుపు కోల్పోయి కిందపడ్డాడు. కొల్లూరు ఎస్ఐ రవీంద్రరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

రేపల్లె రూరల్: పట్టణంలోని 13వ వార్డు కాల్వ కట్టపై అగ్నిప్రమాదం వాటిల్లిన ఘటనలో నిరాశ్రయులైన ఎస్టీ కుటుంబాలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ సభ్యులు సోమవారం బాసటగా నిలిచారు. బాధితులకు వంట సామాగ్రి, టార్పాలిన్ పట్టా, హైజిన్ కిట్లులను మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు అడుసుమల్లి ప్రభాకర్, రేపల్లె మండల యానాది మహానాడు అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, సిఫార్డు స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు మరియ జ్యోతి, కొమరగిరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జోసిల్‌లో మాక్ డ్రిల్

మేడికొండూరు: మండల పరిధిలోని జోసిల్ పరిశ్రమలో అత్యవసర పరిస్థితులను ఏవిధంగా అధిగమించాలో ఎన్డీఆర్ఎఫ్ బృందం ఆధ్వర్యంలో సోమవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. క్లోరిన్ గ్యాస్ లీక్ అవుతున్న పరిస్థితి ఏవిధంగా అధిగమించాలో ప్రాక్టికల్‌గా ఎన్డీఆర్ఎఫ్ బృందం చూపించారు. జోసిల్ పరిశ్రమ సిబ్బందితో ప్రాక్టికల్ చేయించారు. కెమికల్ డిజాస్టర్ కింద జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ఆదేశాల మేరకు డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ శివకుమార్ పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. జిల్లా ఫైర్ అధికారి శ్రీధర్‌బాబు, ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ భూపేంద్రకుమార్, భద్రతా అధికారి సుజిత్, జోసిల్ కంపెనీ సెక్రటరీ కోటా రఘురామ్, ప్రొడక్షన్ అడ్వైజర్ రామినేని బెనర్జిబాబు, యడ్లపాటి భానుప్రసాద్ పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి తొలి ప్రాధాన్యం

- బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి
- ఖాజీపాలెంలో ఆసరా నమూనా చెక్కుల పంపిణీ

పిట్టలవానిపాలెం: ఇచ్చిన మాటను నెరవేర్చే నైజం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సొంతమని బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి అన్నారు. మండలంలోని ఖాజీపాలెం గ్రామ సచివాలయం వద్ద సోమవారం డ్వాక్రా మహిళలకు నాలుగో విడత రుణమాఫీ చెక్కులను అందజేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ కుంతం అనూష అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్న సంకల్పంతో అధిక మొత్తంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా సొమ్మును వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారని అన్నారు. పాదయాత్ర సమయంలో డ్వాక్రా మహిళలకు నాలుగు విడతల్లో రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారని, ఆ ప్రకారం ఇచ్చిన హామీ అమలు చేసిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో చంద్రబాబు రుణ మాఫీ చేస్తానని చెప్పి డ్వాక్రా మహిళలను, రైతులను నిలువునా మోసగించారని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి అన్ని సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. కుల,మతాలు, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. అనంతరం డ్వాక్రా మహిళలకు రుణమాఫీ నమూనా చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో బాపట్ల మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మరాజు, బాపట్ల జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు యేట్ర అశ్వినిరెడ్డి, ఎంపీపీ షేక్ బాజీ, వైస్ ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, కృపానందం, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలాశ్రీనివాసరెడ్డి, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ నాయకులు కూసంపూడి దేవేంద్రరాజు, కుంతం ప్రసన్నరాజు, సీతయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మహిళలకు ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

గ్రామీణ వైద్యం అభివృద్ధికి కృషి

పిట్టలవానిపాలెం: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసినట్లు బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి తెలిపారు. మండలంలోని ఖాజీపాలెం గ్రామంలో రూ.23 లక్షలతో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని గుర్తు చేశారు. ప్రతి రెండు వేల మంది జనాభాకు ఒక గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలను నిర్మించి పాలనను సులభతరం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంతం అనూష, బాపట్ల మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మరాజు, ఎంపీపీ షేక్ బాజీ, వైస్‌ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, కృపానందం, బాపట్ల జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు యేట్ర అశ్వినిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ లీలా శ్రీనివాసరెడ్డి, మంతెన రామచంద్రరాజు, మంతెన గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోన

ప్రకృతి వ్యవసాయం శ్రేయస్కరం

భట్టిప్రోలు: పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకమని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరల అమ్మకాల స్టాల్‌ను భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు ఉదయభాస్కరి మాట్లాడుతూ రైతులు తాము పండించిన పంటల దిగుబడులను మార్కెట్‌లో ప్రత్యేకంగా స్టాల్‌ను ఏర్పాటు చేసి విక్రయించడం ద్వారా లబ్ధి పొందవచ్చునని తెలిపారు. ఈ స్టాల్ ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పని చేస్తుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. స్టాల్‌లో కూరగాయలు, ఆకుకూరలతో పాటు పండ్లు, అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సుభద్ర, ఎంపీడీవో జేవీబీ మల్లికార్జునరావు, ఈవోపీఆర్డీ టి.ఊహారాణి, ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

బండ్లమ్మ దేవాలయంలో చోరీ

విచారణ చేపడుతున్న పోలీసులు

పిట్టలవానిపాలెం: బండ్లమ్మ అమ్మవారి దేవాలయంలో కానుకల హుండీ చోరీకి గురైన ఘటన పిట్టలవానిపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు పిట్టలవానిపాలెం గ్రామంలోని బండ్లమ్మ దేవాలయంలో సోమవారం తెల్లవారు జామున అమ్మవారి దేవాలయంలో పూజలు నిర్వహించేందుకు స్థానిక పూజారి దేవాలయానికి చేరుకున్నారు. దేవాలయం ఆవరణలో గల కానుకల హుండీ తాళం పగులగొట్టి ఉండడంతో నగదు చోరీకి గురయినట్లుగా గమనించి దేవాలయ కమిటీ సభ్యులకు తెలియజేశారు.కమిటీ వారు పరిశీలించి చందోలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చందోలు ట్రైనింగ్ డీఎస్పీ శ్రీ విద్య సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దేవాలయం ఆవరణలో సీసీ కెమెరాలు గత కొద్ది రోజులుగా పనిచేయడం లేదని కమిటీ సభ్యులు తెలిపారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ డీఎస్పీ శ్రీ విద్య

రహదారి ప్రమాదాల నియంత్రణకు సహకరించండి

బాపట్ల: ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రంగారావు పేర్కొన్నారు. 35వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఏరియా వైద్యశాలలో భద్రతా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెహికల్ ఇన్‌స్పెక్టర్ రంగారావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే వైద్యం అందించాలని సూచించారు.ప్రమాదాలు నివారించేందుకు జిల్లాలో ప్రత్యేక మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. సూపరిండెంట్ డాక్టరు కె.సిద్దార్ధ, వైద్యులు రసూల్, సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వెహికల్ ఇన్‌స్పెక్టర్ రంగారావు

అంగరంగ వైభవంగా వేంకటేశుని కల్యాణం

పెదపులివర్రు(భట్టిప్రోలు): లోక కల్యాణార్థం భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామస్తుల ఆధ్వర్యంలో సోమవారం గుత్తావారిపాలెంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం గ్రామంలోని శ్రీ రాజరాజ నరేంద్ర స్వామి వారి దేవాలయం వద్ద నుంచి కల్యాణ వేదిక వద్దకు కోలాట భజన సంకీర్తనలతో స్వామి వారిని ఊరింగింపుగా తీసుకువచ్చారు. గోపూజా కార్యక్రమం అనంతరం హోమం నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఈ మహోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన అన్న సంతర్పణ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని జంపని వీరయ్యలు పర్యవేక్షించారు.



కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

తహసీల్దార్‌లు బాధ్యతల స్వీకారం



ఎం.సుభద్ర | రవీంద్రబాబు | రూపునేని బ్రహ్మం | వై నాగరాజు | నిర్మలానందబాబా | మునిలక్ష్మి

భట్టిప్రోలు తహసీల్దార్‌గా సుభద్ర బాధ్యతల స్వీకారం

భట్టిప్రోలు: భట్టిప్రోలు తహసీల్దారుగా ఎం.సుభద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పని చేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు ఆమెకు స్వాగతం పలికారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ ధూళిపూడి వెంకటేశ్వరరావు ఇంకొల్లుకు బదిలీపై వెళ్లారు.

కొల్లూరు తహసీల్దార్‌గా పుల్లారావు

కొల్లూరు : కొల్లూరు తహసీల్దార్‌గా వి.పుల్లారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎ. శ్రీనివాసరావు ప్రకాశం జిల్లా జె.పంగులూరుకు బదిలీ అయ్యారు. ప్రకాశం జిల్లా హనుమంతునిపాడు తహసీల్దార్‌గా పనిచేస్తున్న వి.పుల్లారావును కొల్లూరుకు బదిలీ చేయడంతో ఆయన ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. కొత్త తహసీల్దార్‌కు రెవిన్యూ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

తహసీల్దార్‌గా రవీంద్రబాబు బాధ్యతల స్వీకరణ

రేపల్లె రూరల్: రేపల్లె తహసీల్దార్‌గా చొప్పర రవీంద్రబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా వింజమూరు తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా రేపల్లె వచ్చారు. రేపల్లె తహసీల్దార్‌గా పనిచేస్తున్న మల్లికార్జునరావు ఒంగోలుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా రవీంద్రబాబుకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు.



కొల్లూరు తహసీల్దార్ పుల్లారావును అభినందిస్తున్న సిబ్బంది

చెరుకుపల్లి తహసీల్దార్‌గా రూపునేని బ్రహ్మం

చెరుకుపల్లి: చెరుకుపల్లి మండల తహసీల్దార్‌గా రూపునేని బ్రహ్మం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రకాశం జిల్లా ఉలవపాడు మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ కె వెంకటేశ్వర్లు నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌కు రెవిన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు.

చుండూరు తహసీల్దారుగా విశ్వనాథ్

చుండూరు(వేమూరు): చుండూరు తహసీల్దారుగా బాలాజీ విశ్వనాథ్ ఉద్యోగ బాధ్యతలు సోమవారం చేపట్టారు. ప్రకాశం జిల్లా మార్కాపురం మండల తహసీల్దారుగా పని చేస్తున్న బాలాజీ విశ్వనాథ్ వేమూరు నియోజకవర్గంలోని చుండూరు మండల తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టారు.

అమర్తలూరు తహసీల్దార్‌గా కవిత

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు తహసీల్దారుగా బి కవిత ఉద్యోగ బాధ్యతలు సోమవారం చేపట్టారు. ఇక్కడ తహసీల్దారుగా పని చేసిన మెహర్ బదిలీపై గుంటూరు జిల్లా కారంపూడికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బాపట్ల జిల్లా పిట్టలవారిపాలెం తహసీల్దారు కవిత ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

నిజాంపట్నం తహసీల్దార్‌గా నాగరాజు

నిజాంపట్నం: నిజాంపట్నం తహసీల్దార్‌గా వై నాగరాజు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా నెల్లూరు జిల్లా సంఘంలో తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై నిజాంపట్నం వచ్చారు.నిజాంపట్నంలో పనిచేస్తున్న నెహ్రూబాబు బదిలీపై వెళ్లారు.

కర్లపాలెం తహసీల్దార్‌గా నిర్మలానందబాబా

కర్లపాలెం: కర్లపాలెం తహసీల్దార్‌గా ఎ.నిర్మలానందబాబా సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన చీరాల అర్బన్ తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై కర్లపాలెం వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన జి.కేశవనారాయణరావు బదిలీపై చీరాల ఆర్డీవో కార్యాలయం డీఏవోగా వెళ్లారు. తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన నిర్మలానందబాబా మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

పిట్టలవానిపాలెం తహసీల్దార్‌గా మునిలక్ష్మి

పిట్టలవానిపాలెం: మండల తహసీల్దార్‌గా మునిలక్ష్మి సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన డి.కవిత అమర్తలూరు మండల తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. నూతనంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన మునిలక్ష్మిని రెవిన్యూ ఉద్యోగులు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

స్పందనకు 9 అర్జీలు

రేపల్లె రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి చక్కని వేదిక స్పందన కార్యక్రమమని ఆర్డీవో హెలా షారోన్ అన్నారు. స్థానిక రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. స్పందనకు ప్రజల నుంచి 11 అర్జీలు అందాయన్నారు. రేపల్లె పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను వంద పడకల వైద్యశాలగా మార్చటంతో పాటు వైద్యశాలలో వైద్యులు, అత్యాధునిక వైద్య పరికరాలు ఏర్పాటు చేయాలని, వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలని పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి సీవీ మోహనరావు వినతిపత్రం అందజేశారు. మాండస్ తుపాను బాధితులకు నష్టపరిహారం మంజూరు చేయాలని బేతపూడి నుంచి ఒక అర్జీ అందిందన్నారు. మరణ ధృవీకరణ పత్రానికై వెల్లటూరు నుంచి ఒక అర్జీ, అండగల్‌లో తప్పులను సరిచేయాలని కోరుతూ రేపల్లె మండలం పోటుమెరక నుంచి మూడు అర్జీలు, సర్వేలో తమ భూమి వివరాలను సరిచేయాలని కోరుతూ చెరుకుపల్లి మండలం పొన్నపల్లి గ్రామం నుంచి అర్జీ అందిందన్నారు. రేపల్లె మున్సిపాలిటీలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు తొలగించాలని రేపల్లె పట్టణ ప్రజలు అర్జీ అందించగా అదే సమస్యపై నిజాంపట్నం మండలం ప్రజ్ఞం గ్రామం నుంచి మరో అర్జీ అందిందన్నారు. లంకెవానిదిబ్బ గ్రామంలో పొలాలకు బండిదారి కల్పించాలని దరఖాస్తు అందిందన్నారు. సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడించారు.

■ పేదలకు దుప్పట్లు పంపిణీ

కర్లపాలెం: సేవా కార్యక్రమాలలో కోన చారిటబుల్ ట్రస్ట్ ముందంజలో ఉంటుందని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ తెలిపారు. దుండివారిపాలెంలో పింఛను అందుకుంటున్న లబ్ధిదారులకు సోమవారం కోన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోన వెంకట్ దుప్పట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యల్లావుల ఏడుకొండలు, ఎంపీపీ యారం వనజ పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ, రేపల్లె

ఆర్.సి.నెం. [illegible]/2023 | తేది: 05-02-2024

బహిరంగ వేలము నోటీసు

[illegible]

నం/-(ప్రత్యేకశ్రేణి కార్యదర్శి(యఫ్.ఎ.సి), వ్యవసాయ మార్కెట్ కమిటీ, రేపల్లె.

పేకాట శిబిరంపై దాడి

తెనాలిరూరల్: పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. పట్టణ సీఎం కాలనీ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో త్రీ టౌన్ పోలీసులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 20,070, సెల్‌ఫోన్‌లు స్వాధీనపర్చుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: తెనాలి రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే స్టేషన్‌లోని నాలుగు, ఐదు ప్లాట్‌ఫాంల మధ్య వ్యక్తి మృతి చెంది ఉన్నాడని వచ్చిన సమాచారంతో జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని సోమవారం పరిశీలించారు. సుమారు 50 నుంచి 60 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మరో ఘటనలో పెదవడ్లపూడి వద్ద పట్టాలు దాటుతున్న అదే గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వర్లు(70)ను రైలు ఢీకొట్టడంతో ఇంజిన్‌లో ఇరుక్కుని ఆదివారం రాత్రి మృతి చెందాడు. దుగ్గిరాల వద్దకు వచ్చాక లోకో పైలట్ గమనించి మృతదేహాన్ని ఇంజిన్ నుంచి దింపారు. తెనాలి జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహ నిర్వాహకుడి అరెస్ట్

తెనాలిరూరల్: వ్యభిచార గృహ నిర్వాహకుడు, ఓ విటుడిని పోలీసులు అరెస్ట్ చేసి ఓ మహిళను రక్షించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన కిషోర్ సుల్తానాబాద్‌లో ఇల్లును అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. నిర్వాహకుడు కిషోర్‌తో పాటు ఓ విటుడిని అదుపులోకి తీసుకుని ఇంట్లో ఉన్న మహిళను స్వధార్ హోంకు తరలించారు. నిందితులిద్దరిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఇసుక లారీలు సీజ్

తెనాలిరూరల్: ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో అధికారులు సీజ్ చేశారు. తెనాలి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం ఆధ్వర్యంలో కొల్లిపర మండలంలో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. రెండు లారీలు పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్నట్టు గుర్తించి సీజ్ చేసి కొల్లిపర పోలీసులకు అప్పగించారు.

సీపీఎం, సీపీఐ నేతలపై కేసు కొట్టివేత

తాడేపల్లిరూరల్: సీపీఎం, సీపీఐ నేతలపై పెట్టిన కేసును కొట్టివేస్తూ మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.శ్రీప్రత్యూష సోమవారం తీర్పు నిచ్చారు. ఆ పార్టీల నాయకులు ఎం.రవి, డి.వెంకట రెడ్డి, కంచర్ల కాశయ్య మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో 2018లో తాడేపల్లి పోలీసులు వివిధ సెక్షన్ల కింద తమపై కేసు నమోదు చేశారని, సాక్ష్యాధారాలు లేకపోవడంతో కేసును కొట్టివేశారని చెప్పారు.

చుండూరు సీఐగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



చుండూరు(వేమూరు): చుండూరు సీఐగా సీహెచ్ ఎల్‌యస్ శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ సీఐగా పని చేసిన రాజమోహన్ ఒంగోలు రూరల్ సీఐగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయవాడ రైల్వే సీ ఐగా పని చేస్తున్న శ్రీనివాస్ చుండూరు సీఐగా బాధ్యతలు చేపట్టారు.

కర్లపాలెం ఎస్ఐగా జనార్ధన్



కర్లపాలెం: కర్లపాలెం ఎస్ఐగా పి.జనార్ధన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఈపురుపాలెంఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై కర్లపాలెం వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన జి.శివయ్య బదిలీపై కొరిశపాడు మండలానికి వెళ్లారు.

తైక్వాండో పోటీల్లో వినయ్‌కు బంగారు పతకం



తెనాలిఅర్బన్: నేషనల్ లెవల్ యూత్ ఫెస్టివల్‌లో భాగంగా నిర్వహించిన తైక్వాండో పోటీల్లో తెనాలిలోని యూనిక్ తైక్వాండో అకాడమీకి చెందిన కంభం వినయ్‌కు బంగారు పతకం లభించినట్లు కోచ్ బట్టు నాగరాజు తెలిపారు. విజ్ఞాన్ యూనివర్సిటీలో ఈ నెల 1, 2, 3 తేదీల్లో వీటిని నిర్వహించినట్లు చెప్పారు. సోమవారం అకాడమీ వద్ద వినయ్‌కు పతకం, సర్టిఫికెట్‌ను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అకాడమీ గౌరవ అధ్యక్షుడు అందె బాలచంద్రమౌళి పాల్గొన్నారు.



సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

బాపట్ల డివిజన్

95055 07638 (బాపట్ల)

90102 23706 (వేమూరు, రేపల్లె)

Office mail : sakshigntadvt@gmail.com